

# అవతార పురుషుడు!

## కొడవటిగంటి కుటుంబరావు

ఆయిదేళ్ళవాణ్ణి. అమ్మలక్కలుచేరి దశమస్కంధం చదివి రసంగ్రోలు తూంటే. సినిమాలో ముసలి మొగుడు తన పడుచు పెళ్ళాంగాని. ఆవిణ్ణిగురించి ఇతరులుగాని. అనుకునేమాటల్లో తన అనుమానాన్ని ధ్రువపరచే భాగాలుమాత్రమే విన్నట్లుగా మధ్య మధ్య కృష్ణుడి అభావచేష్టలను గురించి వింటూండేవాణ్ణి. పెద్దవాళ్ళలాగా చిన్నపిల్లలు ఒకేవిషయాన్ని గురించి బుర్రలు బానపట్టాలిసిన కర్మేమిటి? ఉన్నట్టుండి పారింటపూల చిరుచేదు సువాసన జ్ఞాపకం వస్తుంది. అంతలోనే కిటికీలోంచి ఆవుదూడ లకాయగల మబ్బు కనిపిస్తుంది. మిగిలిన ాద ఆకారంకోసం వెతుకుతూండగానే లకాయ ఇంతపొడుగ్గాసాగి ఏఆకారమూ కుండా పోతుంది. ఆమబ్బును చూస్తుంటే నాటి అర్ధరాత్రి ఇళ్ళు తగలపడటమూ టాపెటా బొంగులుపగిలే చప్పుడూ జ్ఞాప వస్తుంది. ఆ చప్పుడుపోయి మంత్రి పుష్పం వినిపిస్తుంది. పారిజాత పూలవాసన ముక్కుకుతగిలి నంతపనీ అవుతుంది.

....ఓయమ్మ నీకుమారుడు.... మాయిండ్లను పాలు పెరుగు మననీడమ్మా....

పాలూ, వెన్నావాసన తగిలితే చాలు నాకువాంతి అయేది. అసలునాకూ కృష్ణుడికీ అక్కడే బెడిసింది. అస్తమానమూ పాలుతాగి వెన్నతినేవాణ్ణి నేను ఊహించు కోను కూడాలేను. అందులోనూ దొంగిలించి తినటం!

దశమస్కంధంలో కృష్ణుణ్ని గురించిన అసభ్యపువార్తలు రోజూ వినడంచేతనేమో వాడు వొట్టి బూౕిట్ అని నామనస్సులో అభిప్రాయం ఏర్పడింది. నేను పాలూ, వెన్నా ఆరగించలేను. అదలాఉ ంచండి! దొంగతనం చెయ్యగలుగుదునా? ఇంటికోడలి మూతికి వెన్న రాయగలుగుదునా? ఆడాళ్ళ జడలు ముడెయ్యగలుగుదునా? ఆడాళ్ళు స్నానం చేసే చోటికి పోగలుగుదునా? చేతులెత్తి నమ

సత్కారాలు చేయించటం మాట అటుంచండి!

అటువంటిపనులు చెయ్యటానికి పెద్ద తెలివి బలమూ కావాలని కాదు. ఇందులో సహస్రాంశంచేసినా పెద్దవాళ్ళ మక్కెలు విరుగతంతారే! మాటపడటానికే నాకు ఎంతో ఇదియుంగదా. తన్నులు తినేపనులు ఎక్కడ చెయ్యను? ఒకవేళ చేస్తేమాత్రం అందులో ఏమానందం ఉంది?

దశమస్కంధంలో కొన్నిభాగాలు అంతా వినటానికి ఓపికఎక్కడుంది?— విసీ విసీ కృష్ణుడు వొట్టి వెకిలివెధవనీ. వాడికి జీవితంలో ఆనందం తెలీదనీ. తిట్లూ తన్నులూ తినటానికి అభ్యంతరం లేదనీ తేల్చేసుకున్నాను.

ఇంతలోనే నాకు పెద్దషాక్ తగిలింది! వాడు దేవుట్ట! అదంతా అల్లరికాదుట! లీలలుట! తమపిల్లలు తినటానికి బెల్లంముక్క అడిగితేనే చిచింద్రీ వెలిగించినంత హంగా



మా చేసే ఈ అమ్మలక్కలు కృష్ణుడుచేసిన పనులన్నీ మళ్ళామళ్ళా చదివి ఆనందించే వాళ్ళంటే దానికాకారణమేమై ఉంటుందో నాకు వచ్చినా అర్థంకాలేదు....కృష్ణుడిగొడవ మరచిపోయాను.

కొంతకాలమయాక కృష్ణుడు నాకు మళ్ళీ తగిలాడు.అదిమొదలు అడపాదడపా తగులుతూనే ఉన్నాడనుకోండి. కాని ఈసారి కృష్ణుడుకూడా నాతోబాటు పెరిగాడు. నాకిప్పుడు కొత్త అనుమానాలు పుట్టుకొచ్చాయి.

నల్లటివాడు ఆడవాళ్ళలో ఇంతపాప్యులర్ కావటానికి కారణమేమిటి? ఒకగోపికకి తెలీకుండా మరోగోపిక అతగాడికి డేట్ ఎలా ఇచ్చింది? గోపికలంతా అందగత్తెలేనా? లేక కృషుడికి అందచందాలతో ప్రసక్తి లేదా? అతడైతేచాలు ననుకునే జాతివాడా? నింఫోమేనియకా? ఫ్రీలవ్ తియరీవాడా? ఫ్రీలవ్ తియరీవాడైతే ఒంటరిగా ఆపరేట్ చెయ్యడే! (చిన్నికుశంక: దశమస్కంధం కళ్ళకద్దుకునేవాళ్ళ చలం పుస్తకాలెందుకు తగలెయ్యటం?)

కృష్ణుడు గోపికలను కొంతవరకు ఫూల్ చేశాడంటే నాకాశ్చర్యంకలగలేదు. భారీఎత్తున ఫూల్ చేయకుండా అంతమంది గోపికల్ని మేనేజ్ చెయ్యటం మాటలు కాదు. (చూడుము బ్లిట్జ్‌లో ఆధునిక కృష్ణావతార సన్యాసి లీలలు.) కాని గోపికలు చివరిళ్ళా ఫూల్ కావటం ఆశ్చర్యం. అలాటి అమాయికలు మరి పుట్టరుగద! రోడ్ సైడ్ రోమియోల మీద హైహీల్డ్ షూజ్ ఎత్తేరకం ఆడవాళ్ళు జాస్తికావటానే ఇది కలియుగమై కూర్చుందేమో! కృష్ణుడు సరిఅయినయుగమూ, సరయిన స్థలమూ చూసి పుట్టాడని ఒప్పుకోక తప్పదు....

తరువాత మనం కృష్ణుణ్ని రాజుగా చూస్తాం. రాజుకు శౌర్యపరాక్రమాలు ప్రధానం. కృష్ణుడిలో అవి ఉండే ఉంటాయికాని చాలాగోప్యంగా ఉండటంచేత మనకు కనిపించవు. పసితనంలోనే కృష్ణుడు అనేకమంది రాక్షసులనుచంపాడన్నారు.కాని వాళ్లు సులువుగా చావటానికి కాబోలు రాక్షస రూపంలో రాక జంతువులుగానూ, ప్రాణం లేని చక్రాలు మొదలైనవిగానూ వచ్చారు. దోమల రూపంలోనూ, నల్లులరూపంలోనూ ఈగల రూపంలోనూ, తేళ్ళూ జెర్రులూ పాములూ మొదలైన రూపాలలో వచ్చిన మహాభయంకర రాక్షసులను నేను కూడా చాలామందిని చంపాను. వాళ్ళనిజరూపంలో వచ్చిఉంటే చంపలేకపోదునని చెప్పటానికి నాకేమీ బిడియంలేదు.

తనతో యుద్ధం చెయ్యనివారిని ఆకస్మికంగా చక్రప్రయోగంచేసి కృష్ణుడు కొందరిని చంపాడు. ఇవి న్యాయంగా మర్డర్స్ జాబితాలోకి వస్తాయి. కంసుడూ, శిశుపాలుడూ కృష్ణుడిచేతిలో మర్డరయినవాళ్ళు. జరాసంధుడి చావులో గూఢచారితనంకూడా చేరివుంది. ఇవన్నీ పొలిటికల్ ఎసాసినేషన్ లే!


నిజంగా జరాసంధుడివంటివాడు తనమీద దండెత్తి వచ్చినప్పుడల్లా కృష్ణుడుపారిపోయి దాక్కున్నాడు. వినిపించే గీతాలకన్నా వినపడని గీతాలు మరింత శ్రావ్యమైనవట! కృష్ణుడిపరాక్రమం అప్రదర్శితం కావటం

చేతనేమో అందరి పరాక్రమంకన్నా హెచ్చు కీర్తి సంపాదించుకున్నాడు.

కృష్ణుడి రాజకీయాలెటువంటివి? భారతం నాటి రాజకీయచక్రాన్ని తానే తిప్పినట్టు కృష్ణుడుఅక్కడక్కడాకోతలుకోసి ఉండటం చేత భారతయుద్ధంవరకూ జరిగిన కర్మకాండ కృష్ణుడి అంచనాలప్రకారమే జరిగిందను కోవచ్చు. అలాఅయితే కృష్ణుడిరాజకీయా లేమిటో నాకు తెలియదు. కౌరవ పాండవ వంశాలపతనమే కృష్ణుడు కోరివుండాలి. అది కోరినవాడు అద్భుతమైన రాజకీయ "మఫ్"అను కోవాలి. లేదా పార్టిజాన్‌గా పాండవుల విజయమే కోరినవాడైతే అస్త్రంపట్టి యుద్ధం చెయ్యక రథంతోలినందుకు పిరికివాడను కోవాలి. ఏవిధంగాచూసినా కృష్ణుడి రాజకీయ పాత్ర ఏమంత ఘనంగాలేదు.

"ఈ కృష్ణుణ్ని అవతారపురుషుడు చేసిన దెవరు? ఎందుకుచేశారు?" అని ఒకప్పు డాశ్చర్యపడేవాణ్ని. కాని ప్రపంచంపోకడ చూస్తున్నకొద్దీ అటువంటివాడే అవతార పురుషు డనిపించుకుంటాడని తోస్తుంది. మామూలు మనుషులు పాటించే నీతి నియమాలకు అతీతుడుగా ఉండటం. తన శక్తులకూ ఆదర్శాలకూ నిజమైన పరీక్షవచ్చి నప్పుడల్లా ఎక్కడోపోయి దాక్కోవటం, యాదవవంశం తప్పతాగిఆత్మహత్యచేసుకుంటున్న క్షణంలో ముసలికృష్ణుడు దూరంగా వెళ్ళి ఎక్కడో దాక్కోవటం గమనించాలి!-- రాజకీయహత్యలు చెయ్యటం చేయించటం. మంచిజరిగినా చెడుజరిగినా తన నిర్ణయం ప్రకారమే జరుగుతున్నట్టు పదిమందినీ నమ్మించటం - ఇవన్నీ సూపర్‌మాన్ లక్షణాలే! సూపర్‌మాన్ అంటే అవతార పురుషుడే!

హిట్లర్‌చచ్చి ఇరవైఏళ్ళు దాటుతున్నా అతడిభక్తులింకా అనేకదేశాలలో ఆర్భాటాలు చేస్తూనే ఉన్నారు. దక్షిణాఫ్రికాలో కొందరు "హైల్ హిట్లర్" అనటానికి బిడియపడి "88" అని ఒకరినొకరు ఎకాస్ట్ చేసుకుంటు న్నారుట. ఇంగ్లీషులో 8వఅక్షరం "హెచ్." "హైల్" లోనూ "హిట్లర్" లోనూ అది మొదటి అక్షరం! హిట్లర్ ప్రభావం ఇంకా నిలబడిఉన్నందుకు అమాయకులు ఆశ్చర్య పడతారు. కృష్ణుడిపేరు ఇన్ని(?) వేలఏళ్ళు నిలబడి ఉన్నందుకు ఎవరూ ఆశ్చర్యపడరు అదే ఆశ్చర్యం! ●



---

● చెలికత్తె : "శ్రీకృష్ణులవారు సత్యభామగారింట్లో వున్నారమ్మా !"
రుక్మిణి : "అంతా నా గీత."